సాక్షి
కామారెడ్డి

బుధవారం : 14 : జూన్ : 2023



కళాశాల పనులు వేగవంతం

బాన్సువాడ పట్టణంలో నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

- 9లో ▸



ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /27.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ వేడిమి ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు



మల్యాద్రిరెడ్డి కృష్ణారెడ్డి రాంరెడ్డి

కామారెడ్డి టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ప్రకటించిన బీజేపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించింది. మల్యాద్రిరెడ్డి, డాక్టర్ మర్రి రాంరెడ్డి, పైలా కృష్ణారెడ్డిలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు.

జీ-20 విద్యా సదస్సుకు భిక్కనూరు హెచ్‌ఎం



భిక్కనూరు: మహారాష్ట్రలోని పూణెలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్న జీ-20 దేశాల విద్యా సదస్సుకు భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ ఎంపికయ్యారు. ఈ మేరకు, ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబడుతున్న తొలివెలుగు కార్యక్రమం గురించి ఫౌండేషన్ లిటరసీ, సాంకేతిక విద్య గురించి సమాజ భాగస్వామ్యం గురించి శ్రీనాథ్ జీ-20 దేశాల ప్రతినిధులకు వివరించనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,849 మంది హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మంగళవారం 1,849 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 1,935 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 86 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అశోక్ చౌహాన్



రాజంపేట: బ్యాంకు రుణాలను ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అశోక్ చౌహాన్ సూచించారు. మంగళవారం రాజంపేట మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీనిధి రుణాలతో మహిళలు ఉపాధి పొందాలని.. ఇందుకోసం రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ విజయకుమార్, నూతన మేనేజర్ రాజశేఖర్ రావులు బ్యాంకులో అందిస్తున్న సేవలు, ఇన్సూరెన్స్, డిపాజిట్, బ్యాంకు లావాదేవీలు, ఇన్సూరెన్స్‌లో లాభాల గురించి వివరించారు. సమావేశంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు కుమ్మరి సిద్ధవ్వ, సుతారి లక్ష్మి, ఈసీ సభ్యులు, డీఎంజీ రాము, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలు వేగవంతం

- తెలంగాణ వర్సిటీలో రెండోసారి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. తెయూ వీసీ రవీందర్ గుప్తాపై అక్రమాలు, అవినీతి, నిధులు దుబారా చేశారని పాలకమండలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలిసారి ఈ నెల 6న వర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రామచంద్రాపురం యూనిట్(ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ) అదనపు ఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో దాడులు చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల్లోనే మంగళవారం రెండోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. నలుగురు అధికారులు ఉదయం 11 గంటలకు తెయూ పరిపాలనాభవనం చేరుకున్నారు. అకౌంట్స్, ఇంజినీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఏవో కార్యాలయం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో సాయంత్రం 4.40 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. తొలిసారి తమ వెంట తీసుకెళ్లిన ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు, సీపీయూలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. తమ పరిశీలనలో తేలిన కొన్ని అంశాలపై మరింత విస్తృత సమాచారం తీసుకోవడానికి అధికారులు మరోసారి వర్సిటీకి వచ్చినట్లు సమాచారం.

వడ్ల పైసలస్తలేవు..!



నిజాంసాగర్ మండలంలో ధాన్యం తూకం వేస్తున్న కూలీలు(ఫైల్)

- జిల్లాలో రూ. 325 కోట్ల బకాయిలు
- నెల దాటినా ఖాతాల్లో జమకాని డబ్బులు
- ఇబ్బందులు పడుతున్న రైతాంగం
- ఎప్పుడు అడిగినా రెండుమూడు రోజులే అంటున్న అధికారులు

సాక్షి, కామారెడ్డి: ధాన్యం కాంటా వేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో అమలు కావడంలేదు. ధాన్యం కొనుగోళ్లు నేటితో ముగియనున్నాయి. అయితే నెల క్రితం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాలేదు. సకాలంలో ధాన్యం డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో యాసంగిలో సోమవారం నాటికి 3,52,418.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యం విలువ రూ. 725.98 కోట్లు. కాగా ఇప్పటి వరకు రైతులకు రూ. 401.14 కోట్లు చెల్లించారు. అంటే ఇంకా రైతులకు రావాల్సిన బకాయిలు రూ. 325 కోట్లు ఉన్నాయి. వడ్ల పైసలు వస్తే డబ్బులు ఇవ్వాల్సిన వారికి ఇచ్చేయా లని రైతులు ఎదురుచూస్తున్నారు. వరి కోతలు, పంట నూర్పిడి, రవాణా, లేబర్ ఖర్చులకు తెచ్చిన అప్పులు, అప్పటికే పంట సాగు కోసం చేసిన అప్పులు రైతులకు భారంగా మారాయి. డబ్బుల గురించి అధికారులను ఎప్పుడు అడిగినా రెండు, మూడు రోజుల్లో జమ అవుతాయనే సమాధానం చెబుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైసలు రాక ఇబ్బందులు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట తెగుళ్లతో దెబ్బతినడం, వడగళ్ల వానలతో వడ్లు రాలిపోవడం, కోతలకు చైన్ మిషన్లకు అడ్డగోలుగా వెచ్చించాల్సిన పరిస్థితి ఆపై దిగుబడులు తగ్గిపోవడం, కేంద్రాల వద్ద ధాన్యం నానిపోయి రోజుల తరబడి జాగారం చేయాల్సిన పరిస్థితుల్లో రైతులు అనేక అవస్థలు పడ్డారు. ఎలాగోలా ధాన్యం కాంటా అయి మిల్లులకు చేరి రోజులు గడుస్తున్నా డబ్బులు రాకపోవడం రైతులకు సమస్యగా మారింది. దాదాపు అందరు రైతులు పంట సాగుకోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారే. పంట చేతికి వచ్చిన తర్వాత అప్పులు చెల్లించడం, మళ్లీ పంట సాగు కోసం అప్పులు చేస్తుంటారు. ఈ సారి వడ్ల పైసలు రాకపోవడంతో అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. వడ్లు అమ్మినా అప్పు కట్టడం లేదంటూ చాలామంది రైతులను వడ్డీ వ్యాపారులు ఇబ్బంది పెడుతున్నారు. డబ్బులు రాలేదని సర్ది చెప్పలేక అవస్థలు పడుతున్నారు. వెంటనే వడ్ల డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

వానాకాలం సాగుకు కష్టాలు

యాసంగిలో సాగు చేసిన వరి దెబ్బతిని దిగుబడులు పడిపోయి పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితుల్లో రైతులు వానాకాలం సాగుకు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో వరికి తెగుళ్లు, వడగళ్ల వానలతో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. చాలా మంది రైతులకు దిగుబడి పడిపోయి పెట్టుబడులు కూడా చేతికి అందే పరిస్థితి లేదు. వానాకాలం సీజన్ దగ్గర పడుతోంది. ముందస్తుగా పంటలు సాగు చేయాలని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేయడం, దున్నకాలకు పెట్టుబడులు ఎక్కడి నుంచి తేవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం రైతుబంధు ద్వారా ఎకరాకు ఇచ్చే రూ. 5వేలు కూడా ఇంకా విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో రైతులకు వానాకాలం సాగు ఇబ్బందికరంగా మారింది.

నెల రోజులైనా పైసలు రాలేదు



మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. నెల రోజుల క్రితమే వరి కోసి వడ్లను కేంద్రానికి తీసుకువెళ్లాను. 150 బస్తాలు అయ్యాయి. అమ్మి నెల రోజులైనా డబ్బులు రాలేదు. పంట సాగు కోసం, కోతకు అప్పులు చేసిన. డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మళ్లీ వానాకాలం పంట వేయడానికి సమయం దగ్గర పడుతోంది. ఎప్పుడు వస్తయో ఏమో తెలుస్తలేదు.

– కిష్టారెడ్డి, రైతు, సింగితం, నిజాంసాగర్ మండలం

డబ్బులు జమ కాలేదు



నేను 36 రోజుల కిందట కొనుగోలు కేంద్రంలో 83 బస్తాల వడ్లు అమ్మినా. ఇప్పటికీ నయాపైసా రాలేదు. డబ్బులకు ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు వస్తయో చెప్తలేరు. లాగోడీకి తెచ్చిన డబ్బులు సర్దుబాటు చేయాల్సి ఉంది. వానాకాలం సీజన్ కూడా ముంచుకు వచ్చింది. తొందరగా డబ్బులు ఇవ్వాలి.

– మాలోత్ రాము, రైతు, హాజీపూర్ కట్టకింది తండా, ఎల్లారెడ్డి మండలం



స్త్రీనిధి రుణం.. మహిళలకు ప్రయోజనం

- ఈ యేడు రూ. 137 కోట్ల రుణాలు ఇవ్వడమే లక్ష్యం
- ప్రణాళిక రూపొందించిన అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటైన మహిళా సంఘాలకు మరింత చేయూతనిచ్చేందుకు స్త్రీనిధి రుణాలను అందజేస్తున్నారు. ప్రతియేడులాగే ఈ యేడు కూడా జిల్లాలోని మహిళాసంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రూ. 137.37 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ముందుగా నిర్ణయించిన లక్ష్యం మేరకు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వందశాతం లక్ష్యాన్ని నెరవేర్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామసంఘాల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను అందిస్తున్నారు. వీటి ద్వారా తీసుకున్న రుణాలతో ఏర్పాటు చేసుకున్న వ్యాపారాల అభివృద్ధి కోసం మరింత చేయూతను అందించేందుకు వారికి స్త్రీనిధి ద్వారా రుణాలను ఇస్తున్నారు.

గతయేడు 67 శాతం లక్ష్యం మాత్రమే పూర్తి

జిల్లాలో 2022–23లో స్త్రీనిధి ద్వారా రూ. 128 కోట్లు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 776 గ్రామసంఘాల పరిధిలో గల 13,422 స్వయం సహాయక సంఘాలకు చెందిన 8వేల మంది సభ్యులకు రూ. 85 కోట్లు రుణాలుగా ఇచ్చారు. దీంతో గత యేడు జిల్లాలో స్త్రీనిధి రుణాల లక్ష్యం 67 శాతం మాత్రమే నెరవేరింది. ఈ యేడు గతేడాది మాదిరిగా కాకుండా స్త్రీనిధి రుణాలకు సంబంధించి వందశాతం లక్ష్యం నెరవేర్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వీవోఏలను, సీసీలను సమన్వయం చేస్తూ మహిళాసంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలను అందజేస్తున్నారు.



నాగిరెడ్డిపేట మండలంలో మహిళాసంఘాల సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న సీసీ నారాయణ

వందశాతం లక్ష్యాన్ని పూర్తిచేస్తాం

జిల్లాలో ఈ యేడు స్త్రీనిధి రుణాలకు సంబంధించిన లక్ష్యాన్ని వందశాతం నెరవేరుస్తాం. గతేడాది జిల్లాలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి బకాయిలు చాలా ఉండడం వల్ల ముందుగా నిర్ణయించిన లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో రుణాలను అందజేయలేకపోయాం. ఈ సారి స్త్రీనిధి రుణాలకు సంబంధించి వందశాతం లక్ష్యాన్ని నెరవేర్చేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాం.

– శ్రీనివాస్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్, కామారెడ్డి

మహిళల సంక్షేమానికి పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేపీఎస్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళ సంక్షేమ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వవిప్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, కల్యాణలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లకు వేతనాల పెంపు, ఆరోగ్య మహిళ లాంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అంతేకాకుండా మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలతో కలిసి ప్రభుత్వవిప్ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు సుమిత్రానంద్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పున్న రాజేశ్వర్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. అభ్యర్థులు ఇంటిమేషన్ లెటర్లు, అన్ని సర్టిఫికెట్లను తీసుకొని ఉదయం 9 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో హాజరుకావాల్సి ఉంటుంది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



నరేశ్‌రెడ్డి (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నాగార్తి నరేశ్‌రెడ్డి(36) మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు సరిగా పంటలు పండకపోవడంతో అప్పులు చేశాడు. ఈ విషయమై తరచూ మదనపడేవాడు. సోమవారం వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లాడు. తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న చెట్టుకు మంగళవారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



రామేశ్వర్‌పల్లిలో బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన

రామేశ్వర్‌పల్లిలో బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఇంటి వద్ద నరేశ్‌రెడ్డి మృతదేహం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. యువకుడు తాగుడుకు బానిసై అప్పుల ఊబిలో కూరుకుపోయాడని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో బెల్ట్‌షాపులు నడిపించొద్దని పలుమార్లు చెప్పినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి సముదాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం విక్రయిస్తే రూ. ఐదు లక్షల జరిమానా

- రామేశ్వర్‌పల్లిలో గాంధీ విగ్రహం సాక్షిగా గ్రామస్తుల ప్రతిజ్ఞ



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో మద్యం విక్రయించవద్దని.. ఎవరైనా విక్రయిస్తే రూ. ఐదు లక్షల జరిమానా విధించాలని గ్రామస్తులు మంగళవారం తీర్మానం చేశారు. గ్రామంలో బెల్ట్ షాపుల వల్ల యువకులు మద్యానికి బానిసలుగా మారుతున్నారని.. ఈ విషయమై పలుమార్లు గ్రామంలోని బెల్ట్‌షాపుల నిర్వాహకులకు హెచ్చరించినా.. వారు విక్రయాన్ని మానుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా గ్రామానికి చెందిన నాగార్తి నరేశ్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడంతో దీనికి కారణం గ్రామంలో మద్యం విక్రయించడమేనని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే గ్రామంలోని మూడు బెల్ట్‌షాపులపై దాడులు చేసి అక్కడ నిల్వ ఉంచిన మద్యం సీసాలను తీసుకువచ్చి గాంధీ విగ్రహం వద్ద ధ్వంసం చేశారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ. ఐదు లక్షల జరిమానా విధించాలని తీర్మానించారు. గాంధీ విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేశారు.

రక్తదానంలో సెంచరీ..!

- ఆపదలో ఉన్నోళ్లకు ఆప్తమిత్రుడు
- నాలుగున్నర దశాబ్దాల్లో 102 సార్లు..
- బ్లడ్ బ్యాంక్‌తో ఎందరికో సేవలు
- నేడు అవార్డు అందజేయనున్న గవర్నర్

సాక్షి, కామారెడ్డి : వస్త్ర వ్యాపారంలో ఎంత బిజీగా ఉన్నా సరే ఆపదలో ఉన్నవారికి రక్తం ఇవ్వడం కోసం ఎంత దూరమైనా వెళ్లాల్సిందే. ఒక సారి కాదు, రెండు సార్లు కాదు.. ఇప్పటికీ ఆయన 102 సార్లు రక్తదానం చేశాడు. ఎంతో మందికి రక్తం ఇచ్చి ప్రాణదాతగా నిలిచాడు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బాంబే క్లాథ్ హౌజ్ షాపింగ్ మాల్ యజమాని వీటీ రాజ్‌కుమార్ నాలుగున్నర దశాబ్దాలుగా రక్తదానం చేస్తున్నాడు. ప్రతి ఏడాది రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం అలవాటుగా మారింది. రక్తదానం చేస్తూ ప్రాణదాతగా నిలిచిన వీటీ రాజ్‌కుమార్‌ను రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై అవార్డుతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా వీటీ రాజ్‌కుమార్ అందించిన సేవలపై 'సాక్షి' కథనం..



రక్తదానం చేస్తున్న వీటీ రాజ్‌కుమార్

కామారెడ్డిలో లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో విపత్తులు సంభవించినా బాంబే క్లాథ్ హౌజ్ ద్వారా దుస్తులు, ఆహార పదార్థాలను పంపిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించి సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు అందజేస్తారు. రోడ్డు మీద పండ్లు, కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే వారికి ఎండ, వానల నుంచి రక్షించుకునేందుకు గొడుగులు పంపిణీ చేయడం, వైద్య శిబిరాలతో పేదలకు మందులు ఇవ్వడం, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తారు. కామారెడ్డి ఆస్పత్రి సమీపంలో రూ. 5కు భోజనం కూడా పెడుతున్నారు. ఇలా నిత్యం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు.

తండ్రి పేరిట బ్లడ్ బ్యాంక్..

వైద్యం కోసం కామారెడ్డి పట్టణానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా వస్తుంటారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, డెలివరీల కోసం ఇక్కడి ఆస్పత్రులకు వచ్చే వారు సమయానికి రక్తం దొరక్క ఇబ్బందులు పడడమే కాదు ప్రాణాలు కోల్పోయినవారు ఉన్నారు. బాంబే క్లాథ్ హౌజ్ ముందరే ప్రభుత్వ ఆస్పత్రి ఉండడం, ఆస్పత్రికి వచ్చిన వారు బ్లడ్ కోసం పడే ఇబ్బందులను చూసి చలించిపోయిన వీటీ రాజ్‌కుమార్ ఆయన సోదరుడు వీటీ లాల్ బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. తమ తండ్రి వీటీ ఠాకూర్ పేరుతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు క్యాంపులు నిర్వహిస్తూ రక్తం సేకరించి నిల్వ చేయడం, ఆదపలో ఉన్న వారిని ఆదుకుంటూ వస్తున్నారు. నాలుగున్నర దశాబ్దాల కాలంలో వేలాది మందికి రక్తం అందించారు. కాగా రాష్ట్రంలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన వారిని గుర్తించి రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న అవార్డులను అందించేందుకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన వారిలో రెండో వ్యక్తిగా వీటీ రాజ్‌కుమార్‌ను గవర్నర్ తమిళిసై అవార్డుతో సన్మానించనున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం రాజన్న రాజ్‌కుమార్‌ను అభినందించారు.

రక్తదానంతో ఎంతో సంతృప్తి కలుగుతుంది..



సమయానికి రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోయిన ఘటనలు నన్నెంతగానో కలచివేశాయి. అప్పుడు నా వయసు 21 ఏళ్లు. రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నా.అప్పటి నుంచి ఏటా రెండు, మూడు సార్లు తప్పకుండా రక్తదానం చేస్తూనే ఉన్నా. బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేసి ఎంతో మందిని ఆదుకున్నాం. ఎన్ని డబ్బులు సంపాదించినా మనిషికి తృప్తి ఉండకపోవచ్చు. కానీ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడినపుడు ఎంతో తృప్తి కలుగుతుంది. ఇన్ని సార్లు రక్తదానం చేస్తానని కలలో కూడా అనుకోలేదు. మొదట్లో 20 సార్లు చేయాలనుకున్న. తరువాత టార్గెట్ 50 కి పెట్టుకున్నా. ఆ తరువాత వంద సార్లు అనుకున్నా. ఇప్పటికీ 102 సార్లు రక్తదానం చేశాను. శక్తి ఉన్నంత కాలం చేస్తూనే ఉంటా.

– వీటీ రాజ్‌కుమార్, కామారెడ్డి

క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 9029 మంది విద్యార్థులకు గానూ 8646 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 983 మంది విద్యార్థులకు గానూ 895మంది హాజరయ్యారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదని కంట్రోలర్ అన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం తెయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాల నుంచి అన్ని అర్హతలు ఉండి, చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతి



కామారెడ్డి అర్బన్: పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీని క్రమబద్ధీకరణ చేయాలని మంగళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ జ్ఞాన ప్రకాష్‌కు వినతి పత్రం అందజేసినట్లు కామారెడ్డి డెయిరీ కళాశాల ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ కాంట్రాక్ట్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు రవీందర్, మాధవి, పి.శైలజ, వి.చందన, ఎం.అనుదీప్‌రెడ్డి, కీర్తన, స్నేహప్రియ ఉన్నారు.

రైతన్నను ఆదుకుంటున్న కాకతీయ

- ముందస్తుగా విత్తిన పంటలకు కాల్వలోని నిల్వ నీరు సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కాకతీయ కాలువలో బిగించిన మోటార్లు



పంట చేనుల్లో పోస్తున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే కాకతీయ కాలువలో నీరు నిల్వ ఉంచడంతో అన్నదాతలను ఆదుకుంటుంది. దీంతో కాకతీయ కాలువ ఆధారంగా పంటలను సాగు చేస్తున్న అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువలో వేసవిలో కూడ నీటిని నిల్వ ఉంచడంతో రైతులు పంటలకు నీరు అందించుకున్నారు. కాలువ నీటి ఆధారంగా రైతులు ఎప్పుడో కరెంటు మోటార్లను బిగించుకున్నారు. కిలోమీటర్ల మేరా పైపులైన్‌లు వేసుకున్నారు. ప్రస్తుతం కాలువలో నీరు నిల్వ ఉండటం వల్ల రైతులు ముందస్తుగానే పసుపు , మక్క పంటలను సాగు చేశారు. ప్రస్తుతం కాలువ నుంచి నీటి సరఫరా చేస్తున్న నీటి ద్వారానే పంటలు సాగవుతున్నాయి.

పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా..

కాకతీయ, వరద కాలువకు ఇరువైపులా ఉన్న గ్రామాల రైతులు కాలువలకు మోటర్లు బిగుంచుకుని పైపులైన్ వేసుకున్నారు. పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసుకుంటూ పంటలకు నీరు అందిస్తున్నారు. కొందరు రైతులు నాలుగైదు కిలోమీటర్ల వరకు పైపులైన్ వేసుకుని నీటి సరఫరా చేసుకుంటున్నారు. గత 10 రోజుల నుంచి పసుపు పంటను విత్తడంలో రైతులు బిజీగా ఉన్నారు.

రెండు కాలువల్లో నీరు...

కాకతీయ వరద కాలువల పరివాహక ప్రాంతాల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో రైతులు ముందస్తుగానే పంటలను విత్తుతున్నారు. సాధారణంగా మిరుగు కార్తే వరకు పంటలు విత్తకుండ తొలకరి కోసం రైతులు ఎదురు చూస్తుంటారు. కానీ ప్రస్తుతం కాకతీయ కాలువలో, వరద కాలువల్లో భారీగా నీరు నిల్వ ఉండటం వల్ల ఎలాంటి నీటి భయం లేకుండా రైతులు ముందుగానే మక్క, పసుపు పంటను సాగు చేస్తున్నారు. కాకతీయ కాలువకు పరివాహక ప్రాంతాలుగా ఉన్న మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, మండలాల రైతులు, వరద కాలువకు పరివాహక ప్రాంతాలుగా ఉన్న మోర్తాడ్, బాల్కొండ, కమ్మర్‌పల్లి మండలాల రైతులు విత్తనాలు విత్తడం ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయంటే నీటి భరోసా ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లీకేజీ రూపంలో వస్తున్న నీటిని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ వద్ద గేట్లు దించి కాలువలో నిల్వ ఉంచారు. వరద కాలువలో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని తరలించి కాలువలో నిల్వ ఉంచారు. దీంతో పంటలకు నీటి లోటు లేకుండ రైతులకు పూర్తి భరోసా లభిస్తుంది. రెండు కాలువల్లో నీరు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెయూలో సమస్యలు పరిష్కరించాలి



తెయూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని క్యాంపస్ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు తెయూ మెయిన్‌గేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు బహిష్కరించి జీతాల కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో హాస్టల్స్‌లో మధ్యాహ్న భోజనం లేక తాము పస్తులు ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వర్సిటీలో హెల్త్ సెంటర్‌ను మూసి వేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వీసీ, ఈసీ రాజకీయాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్యాంపస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఔట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా

తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మంగళవారం రెండో రోజు విధులు బహిష్కరించారు. పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమ జీతాలు చెల్లించే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నత్తనడకన ఆర్‌వోబీ పనులు

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీ అర్వింద్



అడవి మామిడిపల్లి శివారులో ఆర్‌వోబీ పనులను పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్/మాక్లూర్: మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి శివారులో 63వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు నత్తనడకన సాగుతుండటంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో నిర్వహించిన పార్లమెంట్ సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి వెళుతుండగా మార్గమధ్యలో ఆర్‌వోబీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. బ్రిడ్జిపై బీఆర్ఎస్ నాయకులు వేయించిన వాల్ పెయింటింగ్‌ను చూసి అసహనం వ్యక్తం చేసారు. ఎన్‌హెచ్ డిప్యూటీ ఈఈ శంకర్‌కు ఫోన్ చేసి వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఆర్‌వోబీ పనులకు, రూ.14 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేసినా పనులు నెమ్మదిగా సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచని పక్షంలో కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని హెచ్చరించారు. డిప్యూటీ ఈఈ శంకర్ సమాధానానికి సంతృప్తి చెందని ఎంపీ అర్వింద్ ఈఈ కాంతయ్యకు ఫోన్ చేసి అక్కడి పరిస్థితులను వివరించారు.వారం రోజుల్లో పనులు వేగంగా జరిగేలా చూస్తానని ఈఈ హామీ ఇవ్వటంతో, అర్వింద్ ఏ రోజు ఎంత పని చేశారనేది తనకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిర్మాణంపై బీఆర్ఎస్ నాయకులు దేశ్ కీ నేతా కేసీఆర్, జీవనన్న అంటూ రాసిన వాల్ పెయింటింగ్‌లపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పురుషులకు దేశ్ కీ నేతా అని కాకుండా దేశ్ కా నేతా అని రాయాలని సలహా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి



వెంకటస్వామి (ఫైల్)



కొడుకుకు కొరివి పెట్టిన తల్లి నామాల లక్ష్మి

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్యకు పాల్పడగా, అంత్యక్రియల్లో తల్లి తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన నామాల వెంకటస్వామి(35) అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించేవాడు. వృత్తిరీత్య కామారెడ్డి పట్టణంలో నివసిస్తున్నారు. ఇతడికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు అక్కలు ఉన్నారు. తండ్రి గతంలో మరణించారు. గత శనివారం వెంకటస్వామికి భార్యతో గొడవ జరుగగా, అతడు మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించగా, సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో మంగళవారం సొంతూరు రామారెడ్డిలో అంత్యక్రియలు నిర్వహించారు. కానీ అంత్యక్రియలకు మృతుడి భార్య హాజరు కాకపోవడంతో, మృతుడి తల్లి నామాల లక్ష్మి కొరివి పెట్టాల్సి వచ్చింది. ఈ ఘటన స్థానికులను కలిచివేసింది.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మల్లిఖార్జున్‌రెడ్డి



కమ్మర్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేసినట్లు మల్లిఖార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట



మహిళలు తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న స్పీకర్

వర్ని: రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను కేటాయిస్తూ మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం మహిళా దినోత్సవం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి కేసీఆర్ కృషి చేస్తున్నారని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా మహిళను నియమించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, రుద్రురు ఎంపీపీ అక్కపల్లి సుజాత, కోటగిరి ఎంపీపీ వల్లేపల్లి సునీత, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ హీరోకు అంతర్జాతీయ అవార్డు

- 'మట్టి కథ' సినిమాలో నటించిన అజయ్ వేద్
- ఇండోఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ అవార్డు కైవసం



మట్టి కథ సినిమాలో అజయ్ వేద్

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన అజయ్ వేద్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. తాను హీరోగా నటించిన మొట్టమొదటి సినిమా 'మట్టి కథ'లో ఉత్తమ నటనకు గాను ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఈమేరకు సదరు సంస్థ మంగళవారం అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును ఇప్పటి వరకు తమిళంలో మమ్మనీతం అనే సినిమాలో స్టార్ హీరో విజయ్ సేతుపతికి, బలగం సినిమాలో ప్రియదర్శికి మాత్రమే దక్కింది. వీరి సరసన అజయ్ వేద్ నిలవడంతో మట్టి కథ సినిమాపై అటెన్షన్ బజ్ క్రియేట్ అయింది.

సినీరంగంలో ప్రవేశం ఇలా..

ఆర్మూర్‌లోని మానస హైస్కూల్ కరస్పాండెంట్ గణేష్, పద్మ కుమారుడైన అజయ్ వేద్ తన బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి రామానాయుడు స్టూడియోలో డిప్లొమా ఇన్ ఆక్టింగ్ పూర్తి చేసాడు. సినీ పరిశ్రమలో అతనికి ఉన్న ఆసక్తితో పవన్ కడియాల దర్శకత్వంతో తెరకెక్కిన మట్టి కథ సినిమాలో హీరోగా అవకాశం దక్కించుకున్నాడు. ఇటీవల ఈ సినిమా ట్రైలర్ ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. పల్లెటూరు అంటే పండుగలు, పబ్బాలకు ఇంటికి వచ్చి వెళ్లే ఊరు అన్నట్లు మారిపోయిన ఈ కాలంలో పల్లెటూరి కుర్రోడి ఆశలు, ఆకాంక్షలు ఎలా ఉంటాయి, మట్టితో అనుబంధం, మట్టిలో మధురానుభూతి ఎలా ఉంటుంది అనే అంశంపై సినిమా నిర్మించారు మొదటి సినిమాలోనే అజయ్ వేద్ అంతర్జాతీయ అవార్డును కైవసం చేసుకోవడంతో తెలుగు సినిమా పరిశ్రమతో పాటు బంధువులు, తల్లిదండ్రులను అభినందిస్తున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట: మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో మంగళవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రతి ఏటా మృగశిరకార్తె సందర్భంగా గ్రామ దేవతలకు పండుగలు చేస్తున్నట్లు సర్పంచ్ పుట్టి పోచయ్య తెలిపారు. టెంకాయ నుంచి వెండికడెం కుస్తీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల బోధన్–బాన్సువాడ ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని వాహన దారులకు, హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన దారులకు చలాన్ విధించారు. కార్యక్రమంలో ఏఎస్సై అబిద్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరి రిమాండ్

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ అనే వ్యక్తిని మంగళవారం రిమాండ్ చేసినట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. గత నెల 15న అతడి భార్య మంజుల ఆత్మహత్యకు కారణం కావడంతో సంజీవ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. మంజుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న సంజీవ్‌ను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి శివారులో విద్యుత్‌షాక్‌తో ఓ గేదె మృతి చెందింది. మామిడిపల్లిలోని కొండూర్ దేవన్నకు చెందిన గేదె మూడు రోజుల నుంచి కనపడలేదు. కాగా మంగళవారం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్ద గేదె మృతి చెంది ఉంది. రైల్వే ట్రాక్ మరోవైపు విద్యుత్ సరఫరా చేయడానికి రైల్వే శాఖ వారు పట్టాల కింద నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు గేదె తగలడంతో మృతి చెందిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కాగా గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరాడు.

గేట్ వాల్వ్ కుండీలో పడి..

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ గేట్ వాల్వ్ కుండీలో పడి ఓ గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నక్క బాబుకు చెందిన గేదె మేతకు వెళ్లగా, పైకప్పు ఏర్పాటు చేయని కుండీలో పడి ఇరుక్కుపోయి మృతి చెందినట్లు తెలిపారు.

టేకు దుంగల పట్టివేత



సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని పందిమడుగు బీట్‌లో వ్యవసాయ పొలాల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సెక్షన్ అధికారి సాయికిరణ్ మంగళవారం తెలిపారు. టేకు దుంగలు ఉన్నాయనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15టేకు దుంగలను స్వాధీనం చేసుకోగా, వాటి విలువ రూ. 13వేలు ఉంటుందన్నారు. వాటిని సిరికొండలోని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం



ప్రవీణ్

ఖలీల్‌వాడి: నగరంలోని హమాలీవాడికి చెందిన గొనె ప్రవీణ్ కుమార్(27) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 12న ఉదయం ఇంటి నుంచి పని నిమిత్తం వెళ్లిన ప్రవీణ్ కుమార్ ఇప్పటికీ తిరిగిరాలేదు. అతడి కుటుంబసభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ప్రవీణ్ అన్న గొనె శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా ప్రవీణ్ సమాచారం తెలిస్తే టౌన్–3 పోలీస్ స్టేషన్, నిజామాబాద్ ఎస్సై ఫోన్ 8712659839కు, లేదా 08462220350కు సమాచారం అందించాలన్నారు.

మళ్లీ వస్తానని చెప్పి.. తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



అభిషేక్ (ఫైల్)



ట్రక్కు టైర్ల కింద పడి మృతిచెందిన అభిషేక్

డిచ్‌పల్లి: అమ్మా.. కార్యక్రమం పూర్తికాగానే మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిన కొడుకు, తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. రోడ్డుప్రమాదంలో మృతిచెందా డని తెలిసి ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దేవునగర్ క్యాంప్‌కు చెందిన సలటికి సులోచన అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. ఆమె కొడుకు అభిషేక్(22) బీటెక్ చదువుతున్నా డు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం డిచ్ పల్లిలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి సులోచనను ఆమె కొడుకు అభిషేక్ బైక్‌పై తీసుకువచ్చాడు. ప్రోగ్రాం పూర్తికాగానే వచ్చి, ఇంటికి తీసుకెళతానని తల్లికి చెప్పి అతడు బయలుదేరాడు. అభిషేక్ బ్యాంక్ పనిమీద అదే గ్రామానికి చెందిన స్నేహితుడు మంగళి వినోద్‌తో కలిసి ఇందల్వాయి స్టేషన్‌కు బయలుదేరాడు. నాగ్‌పూర్ గేట్ వద్ద గల హైవే బ్రిడ్జిపై వీరి బైక్‌ను ఆర్మూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కంటెయినర్ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో అభిషేక్, వినోద్‌లు ట్రక్కు టైర్ల కింద చిక్కుకున్నా, ట్రక్కు కొద్ది దూరం వెళ్లింది. అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందగా, వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు.

సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై గణేష్‌లు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ కింద చిక్కుకున్న ఇద్దరిని బయటకు తీశారు. వినోద్‌ను హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి కుడికాలు తీసివేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ట్రక్కు డ్రైవర్, క్లీనర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు.

17కిలోల గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, సీఐలు వేణుమాధవ్, స్వప్న

ఖలీల్‌వాడి: వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 17కిలోల గంజాయిని పట్టుకొని, ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. నగరంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం అడవిమామిడిపల్లి వద్ద గంజాయిని తరలిస్తున్న నిస్సార్ నుంచి 15.225 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయితోపాటు బైక్‌ను, నిస్సార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆర్మూర్‌లోని జిరాయిత్‌నగర్‌లో సోదాలు నిర్వహించగా అక్బర్ అనే వ్యక్తి నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులు ఒరిస్సా నుంచి నిజామాబాద్‌కు బస్సులో గంజాయిని తరలించినట్లు విచారణలో తేలిందన్నారు. బస్సులలో తీసుకువచ్చిన గంజాయిని స్థానికంగా అమ్ముతారని తెలిపారు. జిల్లాలో గంజాయి అమ్మకాలు సాగిస్తే వివరాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను అసిస్టెంట్ కమిషనర్ కిషన్ అభినందించారు. సీఐలు స్వప్న, వేణుమాధవరావు, ఎస్సై రాంకుమార్, హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్, రాజన్న, కానిస్టేబుళ్లు ఉత్తమ్, రాంబచన్, శివ, విష్ణు, భోజన్న, హమీద్, గంగారాం, మంజుల, సుకన్య, అవినాష్ పాల్గొన్నారు.

రైల్వే గేట్‌మన్‌పై దాడి: ఒకరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగర పరిధిలోని అర్సపల్లి రైల్వేగేట్ మన్‌పై దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 11న రాత్రి రైలు రావడంతో గేట్‌మన్ గేట్ వేస్తుండగా, ఒక కారు గేట్‌లోపలికి వచ్చింది. రైలు వస్తుండటంతో కారును వెనుకకు తీయాలని కారు డ్రైవర్‌ను గేట్‌మన్ కోరారు. రైలు వెళ్లిన తర్వాత గేట్ తీయమంటే ఎందుకు తీయవు అంటూ సదరు కారు డ్రైవర్ దుర్భాషలాడుతూ గేట్‌మన్ విధులకు ఆటంకం కలిగించారు. ఈమేరకు రైల్వే గేట్‌మన్ సురేష్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి!



వర్ని: మండలంలోని సిద్దాపూర్ శివారులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జవలగిరి వెంకటి (55) మూడు రోజుల క్రితం మండలంలోని బడా పహాడ్ దర్గా వద్దకు వచ్చాడు. తిరిగి సొంతూరుకు వెళ్తుండగా సిద్దాపూర్ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతుడి కొడుకు విఠల్ వెల్లడించారు. వెంకటిని గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి, చంపివేసి వ్యవసాయ పొలాల్లో పడవేసినట్లు విఠల్ ఆరోపించారు. మంగళవారం సిద్దాపూర్ శివారులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వర్ని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. మృతుడు వడదెబ్బతో మృతిచెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై ఆనంద్ సాగర్ వెల్లడించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరంలోని అమ్మ వెంచర్ వద్ద రైలు నుంచి జారీ పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ప్రణయ్ మంగళవారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని, శవాన్ని జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు నిజామాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించాలని కోరారు.